# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశంలో మహిళపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్చరించారు.**
2. **హైదరాబాదు నగరంలో అక్రమ కట్టడాలకు తావు లేకుండా చెరువులను పరిరక్షిస్తామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**
3. **అంతరిక్ష పరిశోధనా ఫలాలను అందిపుచ్చుకుంటే భారత దేశం మరింత పురోగమిస్తుందని ఆంధ్రప్రదేశ్ శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి కె. పవన్ కళ్యాణ్ సూచించారు.**
4. **దేశ భక్తి స్ఫూర్తికి నిదర్శనంగా 5 కోట్ల మంది ప్రజలు హర్ ఘర్ తి రంగా వెబ్ సైట్‌లో త్రివర్ణ పతాక సెల్ఫీలను పొందుపరచారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
5. **శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని ప్రజలు ఈరోజు భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**
6. **మానవ సేవ కంటే మించింది లేదని చాటి చెప్పిన సంఘ సేవకురాలు మదర్ థెరీసా జయంతి ఈరోజు.**

===========================

దేశంలో మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హెచ్చరించారు. ఇందు కోసం పటిష్టమైన చట్టాలను రూపొందిస్తున్నామని తెలిపారు. మహారాష్ట్రలోని జల్ గావ్ పట్టణంలో నిన్న జరిగిన లఖ్ పతి దీదీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ... మహిళలపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితులలోనూ విడచి పెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. మహిళలపై నేరాల నియంత్రణలో రాష్ట్రాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భారత దేశ భవిష్యత్ ను తీర్చి దిద్దడంలో దేశ మహిళా శక్తి అన్ని వేళలా దోహదం చేసిందని కొనియాడారు.

మహిళలకు సాధికారత కల్పించడానికి ....వారికి భద్రత సమకూర్చడానికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మహిళల జీవితాలను ..., వారి గౌరవాన్ని కాపాడడం మన అతి పెద్ద బాధ్యత అని నరేంద్రమోదీ పేర్కొంటూ .....

..వాయిస్..30 సెకన్లు

తమ జీవితాలు అభివృద్ధి కావడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న లఖ్ పతి దీదీ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తోందని గుంటూరు జిల్లాకు చెందిన ఇరువురూ మహిళలు పేర్కొంటూ ...

..వాయిస్..53 సెకన్లు

మహిళలకు ఆర్థిక సహాయం అందజేసేందుకు ఉద్దేశించిన లఖ్ పతి దీదీ కార్యక్రమం కింద 11 లక్షల మంది లఖ్ పతి దీదీలకు సర్టిఫికెట్లు అందజేసి .... వారితో దృశ్య మాధ్యమం ద్వారా సంభాషించి ... వారు చేపడుతున్న వ్యాపారాలు ..., స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

---------------------------

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన లఖ్ పతి దీదీ కార్యక్రమం నిన్న ఆంధ్రప్రదేశ్ ..., తెలంగాణా రాష్ట్రాలలోని అన్ని ప్రధాన పట్టణాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు ..., రెవిన్యూ ఉన్నతాధికారులు పాల్గొని మహిళలకు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను అందజేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికే కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని....., మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

---------------------------

హైదరాబాదు నగరంలో అక్రమ కట్టడాలకు తావు లేకుండా చెరువులను పరిరక్షించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాదులో నిన్న జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ .... చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రకృతి సంపదను విధ్వంసం చేయడం ఎంత మాత్రం తగదని, చెరువులలో నిర్మించిన అక్రమ కట్టడాల ద్వారా వెలువడే మురుగు నీరు వల్ల చెరువులు కలుషితం అవుతున్నాయని, మన జీవనాధరమైన చెరువులను కాపాడుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్లనే ... ఈ అక్రమ కట్టడాల నుండి చెరువులకు విముక్తి కల్పించడానికే ప్రభుత్వం అక్రమ కట్టడాల కూల్చివేత కార్యక్రమం చేపట్టిందని రేవంత్ రెడ్డి వివరించారు.

---------------------------

తెలంగాణా రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీని బలోపేతం చేసే అంశంపై నిన్న హైదరాబాదులో ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఆన్‌లైన్‌లో పార్టీ సభ్యత్వం తీసుకునే ఏర్పాటు చేస్తామని ...., పార్టీలో యువతకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని చంద్రబాబు నాయుడు తెలిపారు.

---------------------------

అంతరిక్ష పరిశోధనా ఫలాలను సక్రమంగా వినియోగించుకుంటే భారత దేశం మరింత అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని ఆంధ్రప్రదేశ్ అటవీ ..., పర్యావరణ..., శాస్త్ర ...., సాంకేతిక శాఖల మంత్రి కె. పవన్ కళ్యాణ్ సూచించారు. రష్యాకు చెందిన వ్యోమగామి సెర్గి కోర్సకొవ్ ...., స్పేస్ కిడ్జ్ ఇండియా సంస్థ ప్రతినిధులు నిన్న హైదరాబాదులో మంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరిక్షంలో ఆరు నెలల పాటు వున్న సెర్గి అక్కడి విశేషాలను, పరిశోధనాంశాలను పవన్ కళ్యాణ్ కు వివరించారు. అంతరిక్ష

విజ్ఞానంపై విద్యార్థులకు ఆసక్తి పెంచాలంటే ఆంధ్ర ప్రదేశ్‌లో స్పేస్ పార్కు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. వారు చేసిన సూచనకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు.

---------------------------

దేశ భక్తి ..., సమగ్రత ...., సమైక్యతను ప్రజలలో గణనీయంగా పాదుకొల్పిన "ఇంటింటా జెండా" .... హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలిపారు.

మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ... దేశ వ్యాప్తంగా ప్రజలు తమ తమ గృహాలు ..., కార్యాలయాలు ...., దుకాణాలలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయడం ఎంతైనా ప్రశంసనీయమని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశం నలుమూలలా అన్ని వయసుల వారూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్నారని ఆనందం వ్యక్తం చేశారు. హర్ ఘర్ తిరంగా వెబ్ సైట్‌లో అయిదు కోట్ల మందికి పైగా ప్రజలు జాతీయ జెండాలతో సెల్ఫీలను పొందుపరచి తమ దేశ భక్తిని చాటుకున్నారని ...., ఈ కార్యక్రమ ప్రచారం మొత్తం దేశాన్ని ఒక చోట చేర్చిందని ..., ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ స్ఫూర్తి అంటే ఇదేనని నరేంద్రమోదీ పేర్కొన్నారు

ఇలా ఉండగా .... ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ 113వ సంచికలో చేసిన ప్రసంగంపై ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం పది గంటలకు ప్రసార మవుతుంది.

---------------------------

ఈ రోజు శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని ఈరోజు దేశ వ్యాప్తంగా ప్రజలు భక్తి శ్రద్ధలతో ... సంప్రదాయబద్ధంగా జరుపుకుంటున్నారు. ప్రతి ఏడాది శ్రావణ మాసం కృష్ణ పక్షంలో వచ్చే అష్టమి తిథి రోజున ఈ పండుగ నిర్వహిస్తారు. కృష్ణాష్టమిని గోకులాష్టమి ...., అష్టమి రోహిణి ..., శ్రీ కృష్ణ జన్మాష్టమి ...., శ్రీ కృష్ణ జయంతి అని కూడా పిలుస్తారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని మధురా నగరం శ్రీ కృష్ణుని జన్మ భూమిగా పురాణాలు పేర్కొంటున్నాయి. కృష్ణాష్టమి పురస్కరించుకుని ఈ రోజు దేశ వ్యాప్తంగా అన్ని ప్రధాన దేవాలయాలలో ప్రత్యేకించి మధుర నగరంలోని శ్రీ కృష్ణ ఆలయంలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా.... వీధులలో ఉట్లు కట్టి లాగడం ఈ పండుగలోని మరో ప్రత్యేక అంశం.

---------------------------

కృష్ణాష్టమి సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ...., ఉప రాష్ట్రపతి జగ్ దీప్ ధంకడ్ శుభాకాంక్షలు తెలియజేశారు. భగవాన్ శ్రీ కృష్ణుని బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, శ్రీ కృష్ణుని ఆదర్శంగా తీసుకుని దేశ పురోగతి, అభ్యున్నతి కోసం కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపు నిచ్చారు.

కాగా ... జన్మాష్టమికి లోతైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందని జగ్ దీప్ ధంకడ్ తన శుభాకాంక్షల సందేశంలో పేర్కొన్నారు. ధర్మ మార్గాన్ని అనుసరించి అందరి సంక్షేమం కోసం కృషి చేస్తామని ఈ రోజున దేశ ప్రజలు ప్రతిన పూనాలని ఆయన కోరారు.

---------------------------

కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ..., తెలంగాణా రాష్ట్రాల గవర్నర్లు ఎస్ అబ్దుల్ నజీర్ ..., జిష్ణు దేవ్ వర్మ..., ముఖ్యమంత్రులు ఎన్.చంద్రబాబు నాయుడు ...., రేవంత్ రెడ్డి ....,.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్‌లు కూడా ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

--------------------------

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అనే తన మాటను అమలులో చూపించిన... నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా జయంతి ఈరోజు. ప్రస్తుత మాసిడోనియాలో 1910 ఆగస్టు 26వ తేదీన ఆమె జన్మించారు. ఎక్కడో పుట్టి సేవ చేయాలనే సంకల్పంతో భారత్‌కు వచ్చిన ఆమె... కలకత్తాలో కుష్టు వ్యాధిగ్రస్తులకు సేవ చేశారు. సేవ అనే పేరు గుర్తుకురాగానే మదర్ థెరిస్సా పేరును గుర్తుచేసుకునే స్థాయిలో ఆమె ప్రజల మనస్సులో స్థానం సంపాదించారు. మానవసేవ కన్నా మిన్న లేదని చాటిన మదర్ థెరిస్సా...భారత్‌లో ఆపన్నులు, ఆర్తులు, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందువరుసలో నిలిచి.. ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన వనితగా గుర్తింపు పొందారు.

======================